సాక్షి తిరుపతి

శనివారం । 10 । ఆగస్టు । 2024



ఘనంగా గరుడ పంచమి

గరుడ పంచమిని పురస్కరించుకుని తిరుమల శ్రీవారు గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. - 8లో



వక్ఫ్ సవరణ బిల్లు అభ్యంతరకరం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుపై పలువురు మేధావులు అభ్యంతరం వ్యక్తం చేశారు. - 8లో



మద్యం బాటిళ్ల ధ్వంసం

వివిధ కేసుల్లో పట్టుబడ్డ రూ.36 లక్షల విలువ చేసే మద్యం బాటిళ్లను జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు ధ్వంసం చేశారు. - 8లో

అవమానంపై.. ఆగ్రహం!

- అంబేడ్కర్ విగ్రహంపై దాడి పిరికిపంద చర్య
- దాడులకు అడ్డుకట్ట వేయకుంటే ప్రజాగ్రహం తప్పదు
- కూటమి నేతలు స్పందించకపోవడం దారుణం
- దళిత సంఘాల నాయకులు కళ్లు తెరిచి ఉద్యమించాలి

జిల్లాలో దళిత సంఘాల నాయకులు, మేధావులు కదం తొక్కారు. విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనం వద్ద సామాజిక న్యాయ మహాశిల్పం శిలాఫలకంపై ఉన్న అక్షరాలను టీడీపీ అల్లరి మూకలు ధ్వంసం చేయడంపై రగిలిపోయారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన కూడళ్లలోని రాజ్యాంగ రూపశిల్పి, దళితుల ఆరాధ్య దైవం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి తమ అభిమానం చాటుకున్నారు. కూటమి ప్రభుత్వ అండదండలు, అధికార మదంతో సైకోలు కొందరు రెచ్చిపోయిన తీరును ఎండగట్టారు. సామాజిక అభ్యున్నతితోనే దళిత వర్గాల తలరాతలు మారుతాయని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ నినదించిన రోజే పోలీసుల సాక్షిగా దాడికి దిగడం బాధాకరమన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయని, ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఇంత జరుగుతున్నా కూటమి ముఖ్యనేతలు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇలాగే కొనసాగితే ప్రజాగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. తక్షణం నిందితులను అరెస్టుచేసి తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.

– తిరుపతి సిటీ



దళిత ద్రోహి బాబు

తిరుపతి సిటీ: దళిత ద్రోహి సీఎం చంద్రబాబు అని, రాష్ట్రంలో ఉన్మాదం రాజ్యమేలుతోందని ఎస్వీయూ వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మన్నం ప్రేమ్‌కుమార్ ఆరోపించారు. ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం విద్యార్థి సంఘాలు, దళిత సంఘాల నేతలు పాలాభిషేకం చేసి నిరసన వ్యక్తం చేశారు. విజయవాడ బెంజ్ సర్కిల్ వద్ద పోలీసుల సాక్షిగా టీడీపీ అల్లరి మూకలు రాజ్యాంగ రూపశిల్పి అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం అక్షరాలను ధ్వంసం చేయడం దారుణమన్నారు. విద్యుత్ నిలిపివేసి చీకటి దాడులకు పాల్పడడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనిపై సీఎం, డెప్యూటీ సీఎంలు నోరుమెదపకపోవడం దారుణమన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు ముని, నరేష్, సాయి, సంపత్, పవన్, కలందర్, అఖిల్, లిఖిత్, వరుణ్, బబ్లు, చెన్నూ, రాహుల్ పాల్గొన్నారు.



ఎస్వీయూ వద్దగల అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

న్యూస్‌రీల్

ముక్కంటి సేవలో సెంట్రల్ రైల్వే ఐజీ

ఆలయ ధ్వజస్తంభం వద్ద సెంట్రల్ రైల్వే ఐజీ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం సెంట్రల్ రైల్వే ఐజీ ఆరోమసింగ్ ఠాగూర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

31కి ఈ-పంట పూర్తి



మాట్లాడుతున్న జిల్లా సహాయ వ్యవసాయ అధికారి

తిరుపతి అర్బన్: ఈ పంట(గత ప్రభుత్వంలో ఈ క్రాప్) నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 31వ తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా సహాయ వ్యవసాయాధికారి ధనంజయరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయంతోపాటు అనుబంధ విభాగాల వారికి పంట కోత ప్రయోగాలపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ నిబంధనల మేరకు మండలాల వారీగా అన్ని రకాల పంటలను పరిగణనలోకి తీసుకుని పంట కోత ప్రయోగాలు చేపట్టాలన్నారు. గతంతో పోల్చుకుంటే దిగుబడి పెరుగుతుందా.. .తగ్గుతుందా అందుకు కారణాలు తదితర వివరాలతో కచ్చితమైన సమాచారం ఉండేలా లెక్కలు ఉండాలని సూచించారు. ఎన్‌సీఐపీ యాప్ ద్వారా 2024 ఖరీఫ్ పంట కోత ప్రయోగాల వివరాలను నమోదు చేయాలన్నారు. జిల్లా ప్రణాళిక కార్యాలయ ఏడీ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్‌వో అధికారి ప్రశాంతి, డివిజనల్ ఏడీలు, ఏవోలు పాల్గొన్నారు.

అగస్త్య ఫౌండేషన్ ద్వారా శిక్షణ



డీఈఓతో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రతినిధులు, జిల్లా సైన్స్ అధికారి

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యాపరమైన అంశాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య అంతరం తగ్గించడంతో పాటు విద్యార్థుల్లో సబ్జెక్టుపరంగా అభ్యసనా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. శుక్రవారం డీఈఓను ఆ ఫౌండేషన్ ప్రతినిధులు చరంత్, వీరేష్ కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా సైన్స్, గణిత విద్యను సులభరీతిలో అర్థవంతంగా బోధించే అంశాలపై డీఈఓకు వివరించారు. తద్వారా ఉపాధ్యాయులకు బోధనా సామర్థ్యం రెట్టింపుకావడంతో పాటు విద్యార్థులకు సులభరీతిలో బోధించేందుకు ఎలా దోహదాయన్నారు. దీనిపై డీఈఓ స్పందిస్తూ త్వరలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా సైన్సు అధికారి భానుప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 63,685 మంది స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 26,685 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.81 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలలో అనుమతించారని స్పష్టం చేసింది.

దళితులకు తీరని అవమానం



వాకాడు: పాలాభిషేకం చేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: దళితులను అవమానించే విధంగా కూటమి ప్రభుత్వం దుర్మార్గపు పాలన చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. విజయవాడలోని అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై ఉన్న బోర్డు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును ధ్వంసం చేయడందారుణమన్నారు. ఈ మేరకు వాకాడులో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళి అర్పించారు. కొడవలూరు దామోదర్‌రెడ్డి, శేషురెడ్డి, మధురెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి, గూడూరు వెంకటేశ్వర్లురెడ్డి, దేవారెడ్డి, నాగూర్‌రెడ్డి, కస్తూర్‌రెడ్డి, పీ.రాజారెడ్డి, దువ్వూరు భార్గవ్‌రామ, నెల్లూరు పెంచలరెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతపై రాజకీయ కక్షా?

తిరుపతి రూరల్: సామాజిక న్యాయ మహా శిల్పంపై పచ్చ మూకల దాడి హేయమైన చర్య అని తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మండిపడ్డారు. తిరుపతి రూరల్ మండలం, పేరూరు పంచాయతీలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామినేటి కేశవులు, పార్టీ డివిజన్ అధ్యక్షుడు చెంచుమోహన్ యాదవ్, ఉప సర్పంచ్ పరంధామరెడ్డి, పార్టీ నేతలు ప్రసాద్, చంద్రశేఖర్, గంగిరెడ్డి, రవి, రాజారెడ్డి, శశిధర్ పాల్గొన్నారు.



చంద్రగిరి : పేరూరు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మోహిత్‌రెడ్డి

శోచనీయం



ఎంతో మహోన్నతమైన స్థాయిలో విజయవాడలో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనంలోని విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు పూనుకున్న అల్లరి మూకలను వెంటనే అరెస్ట్ చేయాలి. గత పాలకులు డాక్టర బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి దళితుల కల సాకరం చేశారు. అలాంటి విగ్రహాన్ని కూటమి నాయకులు ధ్వంసం చేసేందుకు సిద్ధపడ్డారు. దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలి. – జీ.జయరామయ్య, బీఎస్పీ జిల్లా నాయకులు, చింతవరం, చిల్లకూరు మండలం

జాతి నిర్దేశకునికి అవమానం



దళితుల అభ్యున్నతిని కాంక్షించిన మహా మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్. అలాంటి మహామనిషి విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు నేడు కొన్ని అల్లరి మూకలు ప్రయత్నించడం సిగ్గుచేటు. అలాంటి వారికి దళితులను గౌరవించడం కూడా చేత కాదని అర్థమవుతోంది. ఇంకా దళిత నాయకుల విగ్రహాలపై ఇలాంటి దాడులకు పూనుకునే వారిని కఠినంగా శిక్షించాలి.

– బీ.అంకయ్య, బహుజన సమాజ్ పార్టీ తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అల్లరిమూకలు చేసిన వెకిలి చేష్టలను ఖండిస్తున్నాం. సామాజిక న్యాయ మహా శిల్పం అక్షరాలను తొగించడం, కావాలని కుట్రపూరితంగా చేశారు. దీనిని రాజ్యాంగంపై దాడిగా భావిస్తున్నాం. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిది. దాడికి పాల్పడినవారిని తక్షణం అరెస్టు చేసి శిక్షించాలి. ప్రభుత్వం రాజకీయాలను పక్కన పెట్టి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలి.

–వందవాసి నాగరాజ, సీపీఎం జిల్లా కార్యదర్శి, తిరుపతి జిల్లా

ఉన్మాదులను కఠినంగా శిక్షించాలి



రాజ్యాంగ నిర్మాత అనే గౌరవం లేకుండా పిచ్చిచేష్టలకు పాల్పడుతున్న ఉన్మాదులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి. ఇంత దారుణానికి పాల్పడినా కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం. కక్ష సాధింపు చర్యల్లో భాగంగా రాష్ట్రంలో ఉద్యోగులపైనా దాడులు జరగడం అన్యాయం. దాడుల్లో నిరుపేదలు, దళితులు బలవుతున్నారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన ఘటన అమానుషం. పోలీసు వ్యవస్థ మేల్కోవాలి. – జయచంద్ర, సీఐటీయూ జిల్లా కార్యదర్శి, తిరుపతి జిల్లా

దుర్మార్గం



విజయవాడలో రాజ్యాంగ రూపశిల్పిపై దాడులకు తెగబడ్డ వారిని ప్రభుత్వం గుర్తించాలి. పోలీసులను వెనక్కి నెట్టి విద్యుత్‌ను ఆపేసి దారుణానికి పాల్పడడం చూస్తుంటే సహించలేకపోతున్నాం. యావత్ దళిత జాతి పిరికిపంద చర్యను ఖండించి నినదించాలి. చంద్రబాబు హయాంలో దళితులపైన దాడులు సర్వసాధారణమవుతున్నాయి. వీటిని కట్టడి చేయకుంటే తగిన మూల్యం చెల్లించకతప్పదు. దీనికి కూటమి ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ సమాధానం చెప్పాలి.

-కే.యుగంధర్, భారత దళిత విద్యార్థిసేన వ్యవస్థాపకుడు, తిరుపతి

దళితుల ఆగ్రహానికి గురిగాకతప్పదు



బాబు సర్కార్ దళితుల ఆగ్రహానికి గురికాకతప్పదు. ప్రజాస్వామం మంటగలిసేలా రాజకీయ దాడులు, కక్ష సాధింపులతో రాష్ట్రం రావణకాష్టమవుతోంది. దీనికి తోడు సాక్షాత్తు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై సైతం సైకోలు దాడులకు దిగడం క్షమించరాని నేరం. ఇప్పటికే కూటమి సర్కార్‌పై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది. దళితల దాడిపై డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించాలి.

-వై.శివ, ఏపీ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కార్యదర్శి, తిరుపతి జిల్లా

రాష్ట్రం మరో బిహార్ కావడం ఖాయం



రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను టార్గెట్ చేస్తూ దాడులు చేయడం దారుణం. పిరికిపందలకు వంత పాడుతున్న రాజకీయ నాయకులు, పార్టీలపై చర్యలు తీసుకోవాలి. మూలాలను కనిపెడితే నిందితులను గుర్తించవచ్చు. రాజకీయ, అధికార అండదండలతో కళ్లు కనబడకుండా దాడులు చేస్తే ప్రతిఫలం ఖచ్చితంగా అనుభవించకతప్పదు. ఇలాంటి దాడులను దళిత సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ప్రభుత్వం దాడులను ప్రోత్సహిస్తే రాష్ట్రం మరో బీహారు కావడం ఖాయం.

-మునుస్వామి, ఏపీ విద్యార్థి హక్కుల సంఘం, జాతీయ కార్యదర్శి

రక్షక భటులకు కుల సంకెళ్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుల వివక్ష పెరిగిపోయింది. ముఖ్యంగా పోలీసుశాఖ తీవ్రమైన ఒత్తిడికి లోనై కుదేలవుతోంది. శాంతిభద్రత పరిరక్షణ సంగతి వదిలేసి ఆత్మరక్షణలో పడిపోయింది. పోస్టింగ్ వస్తే చాలు అనుకునే దుస్థితిలోకి జారిపోయింది. సర్కారు సైతం పనితీరును పట్టించుకోకుండా కుల ప్రాతిపదికనే బదిలీల ప్రక్రియ చేపడుతోంది. తమ సామాజికవర్గానికి చెందిన అధికారులకే అగ్రతాంబూలం అందిస్తోంది. ఎస్సీ.. ఎస్టీ.. బీసీ.. రెడ్డి కులాలకు చెందిన వారిని పక్కనపెట్టేసి మానసికక్షోభకు గురిచేస్తోంది. ప్రజల కోసం ఆలోచించకుండా తమ ప్రాపకం కోసం పాకులాడే వారికే పదవులు కట్టబెడుతోంది.

- పోలీస్‌శాఖకు అంటిన క్యాస్ట్ మరకలు
- అనంతపురం రేంజ్‌లో భారీగా సీఐల బదిలీలు
- చిత్తూరు, తిరుపతి జిల్లాలో 18 మందికి లేని పోస్టింగ్‌లు
- ఎస్సీ, ఎస్టీ, రెడ్డి అయితే పక్కన పెట్టేయాలని మౌఖిక ఆదేశాలు
- కూటమి నేతల ఒత్తిడితో కుంగిపోతున్న రక్షక భటులు

చిత్తూరు అర్బన్: పోలీసు శాఖల్లో కుల ప్రస్తావన ఉన్నట్టుండి ఊడిపడింది కాదు. 2014– 19 మధ్య అప్పటి టీడీపీ హయంలో ఈ కుల కల్లోలానికి తెరతీశారు. అప్పట్లో ఉమ్మడి జిల్లాలో ఆరుగురు ఐపీఎస్ అధికారులు పనిచేస్తే ముగ్గురు ఎస్పీ (ఐపీఎస్)లను తమ సామాజికవర్గానికి చెందిన వాళ్లనే ఇక్కడ పెట్టుకున్నారు. పైగా స్పెషల్‌బ్రాంచ్, లా అండ్ ఆర్డర్ డీఎస్పీల్లోనూ అదే సామాజికవర్గ సూత్రమే పాటించారు. అప్పట్లో జరిగిన కానిస్టేబుళ్ల (పీసీ) బదిలీలో సిబ్బంది దరఖాస్తు చేసుకునే ఫామ్‌లో కులం ఏంటో పేర్కొనాలనే దుర్మార్గపు ఆలోచనను సైతం తొలిసారిగా తెరపైకి తీసుకొచ్చారు. 123 మంది ఎస్సీ, ఎస్టీ, రెడ్డి, బీసీ సామాజికవర్గానికి చెందిన కానిస్టేబుళ్లకు పోస్టింగులు ఇవ్వకుండా వేధింపులకు గురిచేశారు. కుప్పం, సత్యవేడు, నగరి లాంటి సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. ప్రత్యేకించి స్పెషల్ బ్రాంచ్ విభాగాన్ని పూర్తిగా 'కమ్మ' సామాజికవర్గంతో నింపేశారు. ఈ అవమానాలు భరించలేక కుప్పంలో ఓ హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్యకు కూడా పాల్పడ్డారు.

తాజాగా సీఐల బదిలీల్లోనూ..

అనంతపురం రేంజ్‌లో 62 మంది సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షేమూషీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో స్థానచలనం పొందిన సీఐల జాబితా పరిశీలిస్తే.. రేణిగుంట అర్బన్‌లో పనిచేస్తున్న టి.మల్లికార్జున, రేణిగుంట రూరల్‌లో పనిచేస్తున్న బి.సుబ్బరాయుడు, తిరుపతి వెస్ట్‌లో పనిచేస్తున్న జె.జయ నాయక్, తిరుమల సీసీఎస్‌లోని కె.రెడ్డిశేఖర్‌రెడ్డి, చిత్తూరు వెస్ట్‌లోని ఐ.రవిశంకర్‌రెడ్డి, చిత్తూరు టూటౌన్‌లోని కె.ఉలసయ్య, కార్వేటినగరంలో ఉన్న పి.సత్యబాబు, చౌడేపల్లెలో పనిచేస్తున్న ఎం.కృష్ణారెడ్డి, వి.కోటలోని ఎస్.లింగప్ప, తిరుపతి డీటీసీలో ఉన్న పి.జగన్‌మోహన్‌రెడ్డి, చిత్తూరు డీసీఆర్‌బీలోని కె.బాలయ్య, శ్రీకాళహస్తి వన్‌టౌన్‌లో ఉన్న ఎస్‌వీ నరసింహారావు, చిత్తూరు సీసీఎస్‌లోని బి.రామాంజనేయులుకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. పోస్టింగ్ దక్కనివారిలో ఐదుగురు షెడ్యూల్ కులాలు, ఒకరు షెడ్యూల్ తెగ, నలుగురు కాపు, ముగ్గురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అధికారులు ఉన్నారు. వీళ్లందరినీ వేకెంట్ రిజర్వుకు పంపాలనే ప్రభుత్వ పెద్దలు, జిల్లా పోలీసుశాఖలో పర్యవేక్షణ చేస్తున్న ఓ అధికారి సూచించడంతో ఈ విధంగా ఆదేశాలు వెలువడ్డాయి. ఇక తిరుపతి ట్రాఫిక్‌లో పనిచేస్తున్న ఎ.శ్రీరాములును తిరుపతి పోలీసు శిక్షణ కేంద్రానికి, తిరుపతి సీసీఎస్‌లో పనిచేస్తున్న జి.మురళీకృష్ణను రేణిగుంట రూరల్, అన్నమయ్యలో పనిచేస్తున్న పి.రామకృష్ణను తిరుపతి వెస్ట్, చిత్తూరు స్పెషల్ బ్రాంచ్‌లో ఉన్న పి.శేషగిరిని తిరుమల సీసీఎస్, తిరుపతి పీటీసీలో ఉన్న ఎం.మురళీని సత్యవేడు, కడప సైబర్‌సెల్‌లో ఉన్న వి.శ్రీధర్ నాయుడును చిత్తూరు వెస్ట్, తిరుపతి పీటీసీలో ఉన్న డి.నెట్టికంతయ్యను చిత్తూరు టూటౌన్, అనంతపురంలో ఉన్న బొడ్డు ప్రసాద్‌ను గంగవరం, కర్నూలులో ఉన్న ఆర్.సోమశేఖర్‌రెడ్డిని వి.కోట, కర్నూలు ఆస్పరీలో ఉన్న ఎస్.హనుమంతప్పను కార్వేటినగరం, కడప సీసీఎస్‌లో ఉన్న ఎం.రాంభూపాల్‌ను చౌడేపల్లె, తిరుపతి పీటీసీలో ఉన్న ఎం.మహేశ్వర్‌ను నగరికి బదిలీ చేశారు. తిరుపతి సీసీఎస్‌లో ఉన్న కె.కళావెంకటరమణను తిరుపతి ట్రాఫిక్‌కు, అన్నమయ్యలో ఉన్న ఎస్.భాస్కర్‌ను చిత్తూరు డీఎస్‌బీ, కె.మద్దయాచారిని చిత్తూరు డీసీఆర్‌బీ, నగరిలో ఉన్న బీఎస్ సురేష్‌ను తొలుత చిత్తూరు వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులిచ్చినా సాయంత్రానికి ఆయనకు పుట్టపర్తి సర్కిల్‌ను కేటాయిస్తూ ఆదేశాలు వెలువడటంలోనూ కుల సమీకరణ ఉపయోగపడిందనే చర్చ వినిపిస్తోంది. అదేవిధంగా సీఐడీలో పనిచేస్తున్న ఎస్.కిషోర్ బాబును గూడూరు రూరల్‌కు, వెంకటగిరిలో ఉన్న జి.సంగమేశ్వర రావును నాయుడుపేట రూరల్కు, ప్రకాశం ఎస్సీ ఎస్టీ సెల్లో ఉన్న ఏ.వెంకటరమణను వెంకటగిరి సర్కిల్‌కు బదిలీచేశారు.




అదే పునరావృతం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని పోలీసుశాఖలో మళ్లీ కులాన్వేషణ మొదలైంది. డీఎస్పీల్లో ఎవరైనా రెడ్డి అని ఉంటే ముందు వాళ్లను పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని, అదే సీఐలకు అయితే వేకెంట్ రిజర్వు (వీఆర్)కు పంపాలని మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఇది ఒక్క 'రెడ్డి' సామాజిక వర్గంతో ఆగిపోలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో 90 శాతం.. కాపుల్లో 60 శాతం మందికి వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులనే ముద్రవేసి పోస్టింగులు ఇవ్వకుండా వీఆర్‌కు పంపుతున్నారు. ఫలితంగా అధికారులతో పాటు వారి కుటుంబాలు కూడా సమాజంలో తలెత్తుకోలేక, అవమానభారంతో చిన్నచూపునకు గురవుతున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఇప్పటి వరకు వెలువడిన నాలుగు బదిలీ ఉత్తర్వుల్లో నలుగురు డీఎస్పీలకు పోస్టింగులు ఇవ్వకపోగా, మొత్తం 18 మంది సీఐలను వీఆర్‌కు పంపారు. ఇంతటితో ఇది ఆగిపోలేదు. ఇంకా రాబోయే డీఎస్పీ, సీఐ, ఎస్ఐల బదిలీల్లోనూ ఇదే తంతు కొనసాగనుంది.

అండగా నిలిచినందుకు వేధింపులా?

- టీటీడీ ఉద్యోగులపై వేధింపులు మానుకోవాలి
- తిరుపతి ఎంపీ గురుమూర్తి డిమాండ్



తిరుపతి మంగళం: టీటీడీ ఉద్యోగుల్లో మెజార్టీ ఓటర్లు కూటమికి అండగా నిలిచిన పుణ్యానికి బహుమానంగా వేధింపులకు గురిచేస్తున్నారని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి మండిపడ్డారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త ప్రభుత్వంలో వేధింపులను ఎదుర్కొంటున్న టీటీడీ ఉద్యోగులకు అండగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

50 మందిపై వేధింపులు

టీటీడీలోని దాదాపు 50 మందికి పైగా ఇంజినీరింగ్, ఇతర శాఖల ఉద్యోగులకు స్టేట్ విజిలెన్స్ విభాగం షోకాజ్ నోటీసులు ఇవ్వడం దుర్మార్గమని ఎంపీ ధ్వజమెత్తారు. తక్షణం ఉద్యోగులపై వేధింపులు మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎవరిపై కోపంతో వేధిస్తున్నారు?

రాజకీయంగా ప్రత్యర్థులమైన తమపై కోపంతో, ఉద్యోగుల్ని వేధించడం హేయమని ఎంపీ తెలిపారు. నెల రోజులుగా విజిలెన్స్ విభాగం టీటీడీలో అణువణువునా శోధించారని, అయినప్పటికీ కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేకపోయారని ఎద్దేవా చేశారు. ఉద్యోగుల సేవల్ని దృష్టిలో పెట్టుకుని తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి టీటీడీ చైర్మన్‌గా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల ఇళ్ల స్థలాల కల నెరవేర్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

రూ.36 లక్షల మద్యం బాటిళ్ల ధ్వంసం



పట్టుబడిన మద్యాన్ని ధ్వంసం చేయిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్: జిల్లాలో పట్టుబడిన రూ.36 లక్షల అక్రమ మద్యం బాటిళ్లను పోలీసులు శుక్రవారం ధ్వంసం చేశారు. జిల్లా ఎస్పీ తెలిపిన వివరాల మేరకు... గత సార్వత్రిక ఎన్నికల్లో ఇతర రాష్ట్రాల నుంచి తిరుపతి జిల్లా మీదుగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అదే విధంగా అనుమతి లేకుండా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిపై 300 కేసులు నమోదు చేసి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఇలా దాదాపు 27,568 (అన్ని రకాల మద్యం 5,017.12 లీటర్లు) బాటిళ్లను రోడ్ రోలర్‌తో ధ్వంసం చేసినట్టు ఆయన పేర్కొన్నారు. దీని విలువ సుమారు రూ.36 లక్షలు ఉంటుందన్నారు. అనుమతి లేకుండా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం బాటిళ్లు తెచ్చి విక్రయిస్తే సహించేది లేదన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా బెల్ట్ షాపులు నిర్వహించడం లాంటివి చేయకూడదన్నారు. ఇలాంటి కేసుల్లో పదే పదే పట్టుబడితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామన్నారు. తిరుపతి జిల్లాకు వచ్చే ఎంట్రీ పాయింట్లు వద్ద నిఘా పెంచామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, రాజేంద్ర పాల్గొన్నారు.

రేపు ఎంబీయూలో ప్రథమ స్నాతకోత్సవం

చంద్రగిరి: ఏ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు యూనివర్సిటీలో ఆదివారం మొదటి స్నాతకోత్సవ, శ్రీవిద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాల 13వ పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో ఎం.టెక్, ఎంసిఏ, ఎంబిఏ, ఎంఎస్‌సి పూర్తి చేసుకున్న 323 మంది పీజీ విద్యార్థులు, అలాగే శ్రీవిద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాలలో పట్టభద్రులైన బీ.టెక్ విద్యార్థులు 1,538 మంది పట్టాలను అందుకోనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరవుతారని, ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ మంచు మోహన్‌బాబు అధ్యక్షత వహించనున్నట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు పలకడం దారుణమని ముస్లింలు మండిపడుతున్నారు. ప్రాధాన్యత కలిగిన వక్ఫ్ చట్టం–1995లో కేంద్ర ప్రభుత్వం మార్పులు తీసుకువస్తే వంత పాడడం సరికాదని విమర్శిస్తున్నారు. ముస్లింల సంక్షేమంపై కనీసం ఆలోచించకుండా ఏకపక్షంగా ఆమోదం తెలిపేందుకు సహకరించడం క్రూరమని ఆరోపిస్తున్నారు. లోపాయికారీ ఒప్పందాలతో చంద్రబాబు తమను దగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుట్రపూరితంగా ముస్లింలపై వివక్ష చూపుతున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇదే సమయంలో మైనారిటీ హక్కులకు భంగం కలిగించే బిల్లును ఎంతమాత్రం సహించమని పార్లమెంట్ వేదికగా గళం విప్పిన వైఎస్సార్‌సీపీ వైఖరిని అభినందిస్తున్నారు.



మాయదారి బిల్లుకు టీడీపీ మద్దతు

- చంద్రబాబు వైఖరిపై మండిపడుతున్న ముస్లింలు
- వక్ఫ్ సవరణ బిల్లుకు అండగా నిలవడంపై ఆగ్రహం
- ముస్లింలకు అన్యాయం జరుగుతుందని బిల్లును వ్యతిరేకించిన వైఎస్సార్‌సీపీ

తిరుపతి సిటీ: పార్లమెంట్‌లో వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును ప్రవేశపెట్టడం క్రూరమైన విధానమని జిల్లాలోని ముస్లిం మత పెద్దలు, దర్గాకమిటీలు, ముస్లిం సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. వక్ఫ్ చట్టం–1995లో మార్పులు తీసుకురావడం కరెక్టు కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అలాగే చట్టం పేరును యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫిషియెన్సీ, డెవలప్‌మెంట్ యాక్ట్ -1995గా మారుస్తూ కేంద్రం రూపొందించిన వక్ఫ్ సవరణ బిల్లు సరైనది కాదని మండిపడుతున్నాయి. సమాజంలో ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రవేశ పెట్టిన బిల్లు దారుణమైందని అభిప్రాయపడుతున్నాయి. రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ, సమాజాన్ని విచ్ఛిన్నం చేసేలా సవరణ బిల్లు ఉందని ముస్లిం మత పెద్దలు స్పష్టం చేస్తున్నారు.

వక్ఫ్ చట్టం అంటే ఏంటి?

దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత మొదటి సారిగా 1954లో వక్ఫ్ చట్టాన్ని అప్పటి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. 1995లో తొలిసారిగా చట్టాన్ని సవరించి వక్ఫ్ బోర్డుకు మరిన్ని అధికారాలను అప్పగించింది. ఆ తర్వాత 2013లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ మరోసారి సవరణలు చేసింది. వక్ఫ్ బోర్డులకు విశేష అధికారాలను కల్పించింది. వక్ఫ్ బోర్డు నిర్ణయాలను ఏ కోర్టుల్లోనూ సవాల్ చేయలేని విధంగా ప్రత్యేక అధికారాలను అప్పగించింది.

సవరణ బిల్లుకు టీడీపీ సహకారం

వక్ఫ్‌బోర్డుపై దురుద్దేశపూర్వకంగా కేంద్ర ప్రభుత్వం సవరణ బిల్లు ప్రవేశ పెట్టిందని ముస్లింలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సవరణ బిల్లును వ్యతిరేకించాల్సిన టీడీపీ ఎలా మద్దతు ఇస్తుందని ప్రశ్నిస్తున్నారు. ముస్లింల ప్రయోజనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు విస్మరించారని మండిపడుతున్నారు. సవరణల బిల్లు చట్టరూపం దాల్చితే వక్ఫ్ బోర్డుల నామమాత్రంగా మిగిలిపోతాయని ఆందోళన చెందుతున్నారు. ముస్లింలకు అన్యాయం చేసే బిల్లును వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్తులు స్వాధీనం చేసుకునే కుట్ర



కేంద్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీల పట్ల వ్యవహరిస్తున్న తీరు అవమానకరం. ముస్లింలను శత్రువులుగా చూస్తున్నారు. మోదీ ప్రభుత్వం ప్రజల మధ్య మత మౌఢ్యానికి తెరలేపి వివాదాలు సృష్టిస్తోంది. పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లుకు టీడీపీ, జనసేన పార్టీలు మద్దుతు తెలపడం దారుణం. వారు ముస్లింలకు వ్యతిరేఖంగా వ్యవహరించినట్లు తేటతెల్లమైంది.

–అబ్దుల్, వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్, తిరుపతి జిల్లా

అణచివేసే ప్రయత్నం



పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదిస్తూ కొన్ని పార్టీలు వ్యవహరించిన తీరు బాధాకరం. ముస్లిం మైనారిటీలను అణచివేసేందుకు కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సమాజంలో మానవులంతా సమానం. మోదీ ఆలోచనలో ఒక వర్గాన్ని లక్ష్యం చేసే కుట్ర పన్నుతున్నారు. అందుకు సహకరించే ప్రతి పార్టీ ముస్లిం వ్యతిరేఖిగా భావించాల్సి ఉంది. పవన్ కళ్యాణ్ ముస్లిం ప్రజలకు ఏమి సమాధానం చెబుతారో వేచి చూడాలి.

–లతీఫ్, వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి, వరదయ్యపాళెం

మైనారిటీలను వేధిస్తున్నారు



వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం తెలపడం బాధాకరం. యావత్ ముస్లిం మైనారిటీలు, ప్రజలు ఈ బిల్లును వ్యతిరేఖిస్తున్నా పార్లమెంటులో తమకు మద్దతు ఉందన్న ధీమాతో కేంద్రం వ్యవహరించడం దారుణం. నేడు ముస్లిం మైనారిటీలకు అన్యాయం జరిగింది. రేపు క్రిష్టియన్ మైనారిటీల పరిస్థితి ఇంతే. మోదీ ప్రభుత్వంతో పాటు ఆయనకు మద్దత్తు నిచ్చే పచ్చ పార్టీలు మైనారిటీలను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారు. భవిష్యత్‌లో తొత్తుపార్టీలకు ప్రజలు బుద్ధిచెప్పేరోజు తప్పక వస్తుంది.

–రహంతుల్లా, సీనియర్ సిటిజన్, తిరుపతి రూరల్, చంద్రగిరి

ప్రజలు గమనిస్తున్నారు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలా రెండు నెలల పాలనను ప్రజలు గమనిస్తున్నారు. అభివృద్ధిని ఆమడ దూరంలో పెట్టి ప్రజావ్యతిరేఖ కార్యకమాలే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వాలకు త్వరలో తగిన బుద్ధి చెబుతారు. ఈ బిల్లు ఆమోదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లిం మైనారిటీ వ్యతిరేకులుగా ముద్ర వేసుకున్నాయి. ప్రజలను మభ్యపెట్టి ముస్లిం ఆస్తులను లాక్కోనే దిశాగా కేంద్రం అడుగులు వేస్తోంది. దీనిపై రాజకీయ పార్టీలు వ్యతిరేకించకపోవడం దారుణం.

–మహ్మద్ నిషాంత్ సుల్తానా, అడ్వకేట్, సూళ్లూరుపేట

సమంజసం కాదు



కేంద్ర ప్రభుత్వం మైనారిటీలను టార్గెట్ చేస్తోంది. వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదించడం రాజ్యాంగ వ్యతిరేఖమనే జ్ఞానం లేకుండా మోదీ సర్కార్ ప్రవర్తించడం సబబుకాదు. అందుకు తానాతందానలా తొత్తు పార్టీలు వంతపాడుతూ ఆమోదం తెలపడం తెలివి తక్కువతనానికి నిదర్శనం. ముస్లింలనే కాదు క్రిష్టియన్లపైన ఇలాంటి చర్యలకు పాల్పడుతుందనే ప్రజలు భయపడుతున్నారు. మైనారిటీ మేధావులు, సంఘాలు ఏకమై గళం విప్పాల్సి సమయం ఆసన్నమైంది.

–జూనపూడి ఎజ్రా, దళిత విద్యార్థి సంఘం నాయకుడు, తిరుపతి

పునరాలోచించుకోవాలి



పార్లమెంట్లో ప్రవేశ పెట్టిన వక్ఫ్ బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలి. దీనికి టీడీపీ మద్దత్తు ఇవ్వడం కూడా సబబు కాదు. ఎంతో మంది మత పెద్దలు సంపాదించిన వక్ఫ్ బోర్డు ఆస్తులపై ముస్లింలకు అధికారం లేకుండా చేసేందుకు ప్రవేశ పెడుతున్న బిల్లుకు టీడీపీ మద్దత్తు ఇవ్వడం బాధాకరం. దేశంలో వక్ఫ్ బోర్డుకు ఉన్న ఆస్తులను కాజేసేందుకే ఈ ఎత్తుగడ వేస్తున్నారు. దీనికి టీడీపీ మద్దత్తు ఉపసంహరించుకోవాలి.

– షేక్ మొబీన్‌బాషా, గూడూరు నియోజకవర్గ ముతవల్లిల కమిటీ అధ్యక్షుడు, కోట

ఘనంగా

గరుడ పంచమి



గరుడ వాహనంపై మలయప్ప స్వామి

తిరుమల: గరుడ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం తిరుమలలో మలయప్పస్వామి వారు తమ ఇష్ట వాహనమైన గరుడునిపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీవారి వాహనాల్లోను, సేవకుల్లోను అగ్రగణ్యుడు గరుడుడు. ప్రతి ఏడాదీ గరుడ పంచమిని శుక్ల పక్షం ఐదో రోజు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గరుడ వాహన సేవలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, సీవీఎస్ఓ శ్రీధర్, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైల్వే ఐజీ తనిఖీలు



రేణిగుంట సీఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్లో తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే ఐజీ అరోమా సింగ్ ఠాకూర్

రేణిగుంట: రేణిగుంట రైల్వే జంక్షన్‌ను దక్షిణ మధ్య రైల్వే ఐజీ అరోమాసింగ్‌ఠాకూర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆమె తొలుత రేణిగుంట రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఉన్న సీఆర్‌పీఎఫ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్‌లో రైల్వే ప్రయాణికుల భద్రత, స్టాళ్లలో నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు జరుగుతున్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. పలు కేస్ రికార్డులను పరిశీలించారు. అనంతరం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. రైళ్లలో మదరక ద్రవ్యాల తరలింపు, దొంగతనాల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. రేణిగుంట ఐపీఎఫ్ సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళా సాధికారిత దిశగా

మార్పు రావాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు




దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల వ్యవస్థాపకుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

చిల్లకూరు: మహిళా సాధికారిత దిశగా దేశం అడుగులు వేయాలని భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపు నిచ్చారు. గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు అల్లారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి, డాక్టర్ సీఆర్‌రెడ్డి విగ్రహాలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకయ్య నాయుడు మాట్లాడుతూ మహిళా సాధికారతను గుర్తించి 1981లో మహిళలకు కళాశాలలను ఏర్పాటు చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. నేడు మహిళలపై అక్కడక్కడా హింసలు, అసమానతలు, వివక్ష, అత్యాచారాలు వంటి సంఘటనలు చోటుచేసుకోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య సీఎంకేరెడ్డి, కళాశాల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ మోహన్‌మణి, డాక్టర్ జనార్దనరెడ్డి, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, డాక్టర్ రోహిణి పాల్గొన్నారు.


ఏసీ, ఫ్రిడ్జ్ సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో 14వ తేది (బుధవారం) నుంచి 30 రోజుల పాటు పురుషులకు రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషన్(ఏసీ) రిపేరు, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.సురేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 ఏళ్లలోపు నిరుద్యోగ పురుషులు అర్హులన్నారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదివి ఉండాలని, శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, రానూ పోనూ ఒకసారి చార్జీకి నగదు ఇవ్వనున్నట్టు తెలియజేశారు. శిక్షణానంతరం ధ్రువపత్రాలు అందజేస్తామని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌లు, 4 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో సంస్థకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. తొలుత పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇస్తామని, మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకా నగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289, 83091 64644 సంప్రదించాలని ప్రకటనలో కోరారు.

ముందంజలో కర్నూలు జట్టు



69 పరుగులు తీసిన ఆంజనేయులు



4 వికెట్లు పడగొట్టిన వర్షిత్ రెడ్డి

వెంకటగిరి రూరల్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని తారకరామ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న సౌత్‌జోన్ సీనియర్ విభాగం క్రికెట్ పోటీలు పోటాపోటీగా సాగుతున్నాయి. కర్నూలు–చిత్తూరు జట్ల మధ్య పోటీ నెలకొనగా కర్నూలు జట్టు ఆధిక్యంలో నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూల్ జట్టు 53.04 ఓవర్లకు 244 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో ఆంజనేయులు 69 పరుగులు, ఉదయ్‌తేజ 40 పరుగులు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 28 ఓవర్లకు 92 పరుగులు తీసి 4 వికెట్లు కోల్పోయింది. ఈ జట్టులో శశాంక్ శ్రీవాట్ 37 పరుగులు తీయగా వర్షిత్‌రెడ్డి 4 వికెట్లు తీశారు.

ఈ గురుకులం.. మాకు శాపం!

- ఏకలవ్య మోడల్ గురుకులం విద్యార్థుల ఆవేదన
- రుచీపచీ లేని అన్నం, కూరలు వడ్డిస్తున్నారు
- స్నానానికి నీళ్లు కూడా ఉండడం లేదు
- ఒకే గదిలో పది మందిని కుక్కేస్తున్నారు
- కలెక్టర్‌కు ఏకరువు పెట్టిన విద్యార్థులు




విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

బుచ్చినాయుడుకండ్రిగ: 'సర్..మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదు. రోజూ స్నాక్స్ కూడా ఇవ్వడం లేదు. కోడిగుడ్లు సక్రమంగా పెట్టకపోగా.. చికెన్ రెండు ముక్కలే వేస్తున్నారు. రోజూ రుచీపచీ లేని పప్పు చారు వడ్డిస్తున్నారు. స్నానానికి నీళ్లు కూడా లేవు. ఒకే గదిలో పది మందిని కుక్కేస్తున్నారు. నీళ్ల పాలు, ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారు. కూరలు రుచిగా ఉండడంలేదు. మెస్‌లో ఫ్యాన్లు కూడా తిరగవు. బాత్ రూమ్‌లు అధ్వానంగా ఉన్నాయి. న్యాప్‌కిన్స్ ప్యాడ్స్ ఇవ్వడం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన హిందీ ఉపాధ్యాయులు బోధించే పాఠాలు అర్థం గాక చదవలేక పోతున్నాం. ఈ గురుకుల పాఠశాల మాకు శాపంగా మారింది.. సర్' అంటూ బుచ్చినాయుడుకండ్రిగ మండలం, కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల విద్యార్థులు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఆయన శుక్రవారం పాఠశాల, హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల నోట్ బుక్స్ పరిశీలించారు. అలాగే మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. తాగునీటి ఆర్వో సిస్టమ్, అన్నం వండే స్టీమ్, చపాతీలు తయారుచేసే యంత్రాలను రిపేరు చేయించుకోవాలన్నారు. విద్యార్థులకు రోజువారీ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, వారికి అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్పాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీసిటీని సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

శ్రీసిటీ(సత్యవేడు): తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్ శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. మొదటి సారి శ్రీసిటీ సందర్శనకు వచ్చిన జిల్లా అధికారులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పారిశ్రామికవాడ ప్రగతి, ప్రత్యేకతలను వారికి వివరించారు. ఈ ప్రాంతంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి, శాంతి భద్రతల అంశాలను అధికారులతో చర్చించారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీ పరిసరాలతో పాటు డైకిన్ పరిశ్రమను అధికారులు సందర్శించారు. జిల్లా అధికారుల వెంట స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



పరిశ్రమల శాఖ కార్యదర్శికి స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

చిట్టేడులో పురాతన శాసనం

కోట : మండలంలోని చిట్టేడు గ్రామంలో చిట్టేటమ్మ ఆలయానికి సంబంధించి మట్టిలో కూరుకుపోయిన 16 శతాబ్దం నాటి శాసనాన్ని శుక్రవారం గ్రామస్తులు వెలికితీశారు. గ్రామస్తుల వినతి మేరకు గూడూరు ఎస్‌కేఆర్ కళాశాల చరిత్ర అధ్యాపకులు గోవిందు సురేంద్ర, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో సీనియర్ ఫెలోగా పనిచేస్తున్న మమత శాసనాన్ని పరిశీలించారు. 16వ శతాబ్దానికి చెందిన శాసనంగా గుర్తించారు. పాలెగాళ్ల వంశస్తులు వేయించిన శాసనంగా తెలుస్తోందన్నారు. క్రీ.శ 1611వ సంవత్సరంలో చిట్టేడు గ్రామ వివరాలు, ఆలయ నిర్మాణం, కోనేరు మండపానికి సంబంధించిన వివరాలు శాసనంలో పొందుపరిచి ఉన్నాయన్నారు. ఈ శాసనం సంస్కృత భాషలో ప్రాచీన తెలుగు లిపిలో మొత్తం 16 పంక్తుల్లో శంఖుచక్ర, సూర్యచంద్ర నామాల గుర్తులతో ఉందని మమత తెలిపారు.



చిట్టేటమ్మ ఆలయ శాసనాన్ని పరిశీలిస్తున్న అధికారులు